క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక


అమూల్య

గుంతకల్లు: బాలికల అండర్-20 అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి 400 మీటర్ల పరుగు పందెం పోటీలకు గుంతకల్లుకు చెందిన అమూల్య ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతున్న అమూల్య శుక్రవారం అనంతపురంలోని పీటీసీ మైదానంలో నిర్వహించిన బాలికల అండర్-20 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం అమూల్యను అభినందించింది.

నాయీ బ్రాహ్మణులను విమర్శిస్తే ఊరుకోం


నినాదాలు చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు

యాడికి: నాయీ బ్రాహ్మణులను బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు విమర్శించటం సిగ్గుచేటని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని మండల నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలోని నాయీ బ్రాహ్మణ సంఘం కార్యాలయం వద్ద ఆ సంఘం మండల అధ్యక్షుడు రామేశ్వరుడు, సభ్యులు మాట్లాడారు. రెండురోజుల క్రితం బాపట్ల ఎమ్మెల్యే నాయీ బ్రాహ్మణులను హేళనగా మాట్లాడారన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ నాయీ బ్రాహ్మణులను హీనంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు సంజీవరాయుడు, రామసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, ఓబులేసు, వెంకటరంగనాయకులు, నారాయణ స్వామి, అశోక్, నరేష్, రామకృష్ణ, రామాంజనేయులు, బాలాంజనేయులు, కృష్ణ, ఆంజనేయులు, రంగనాథ్, శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం


అదృశ్యమైన మాధవి, పిల్లలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గుత్తి: మూడు నెలల క్రితం అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన మాధవి అనే మహిళ మూడు నెలల క్రితం తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మాధవి హైదరాబాద్‌లో ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. పీసీలు భాస్కర్‌నాయుడు, కృష్ణవేణి హైదరాబాద్ వెళ్లి మాధవిని పిల్లలను అదుపులోకి తీసుకున్నారు. వారిని గుత్తికి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆర్డీటీకి 'ఎఫ్‌సీఆర్‌ఏ' లైసెన్స్ రెన్యువల్ చేయాలి



మాట్లాడుతున్న మోహన్‌నాయక్

పామిడి: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సు రెన్యువల్ చేయాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలోని విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు విద్య, వైద్యంలో ఆర్డీటీ బృహత్తర సేవా కార్యక్రమాలు అందించిందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజలు సంఘటితమై ఉద్యమించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్

రైతులు పంటలు సాగు చేయడం ఒక ఎత్తయితే.. వాటిని కాపాడుకోవడం మరో ఎత్తు. పంట సాగు చేసింది మొదలు, కోత కోసే వరకూ ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ అన్నదాతలు ముందుకు సాగుతున్నా.. అడవి జంతువుల బెడద ఎక్కువవుతోంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు పలువురు రైతులు సోలార్ ఫెన్సింగ్ విధానం ఏర్పాటు చేసుకున్నారు.

- అడవి జంతువులకు చెక్
- రైతుల వినూత్న ఆలోచన



పుట్లూరు సమీపంలో దానిమ్మ తోట వద్ద ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్ పరికరం,పొలం చుట్టూ లాగిన సోలార్ ఫెన్సింగ్ తీగలు

పుట్లూరు: అడవి పందులు, జింకలు, కోతులు, ఇతర జంతువుల నుంచి పంటలను రక్షించుకోవడానికి రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పంటలను కాపాడుకోవడానికి గతంలో చట్ట విరుద్ధంగా విద్యుత్ తీగలు లాగి పంటను కాపాడుకునే క్రమంలో రైతన్నలే విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాణహాని లేని ఆధునిక విధానాల వైపు ఆసక్తి చూపుతున్నారు. మొక్కజొన్న, అరటి, జొన్న తదితర పంటలను అడవి జంతువుల నుంచి కాపాడుకోవడానికి సోలార్ ఫెన్సింగ్ రైతులకు చాలా ఉపయోగకరంగా మారింది.

ఖర్చు తక్కువ

సోలార్ కంచెను వన్య ప్రాణులు, పశువులు, తాకినప్పటికీ వాటికి ఎలాంటి ప్రాణహాని ఉండదు. సోలార్ ద్వారా వచ్చే షాక్‌తో అవి బెదిరిపోయి పంట పొలాలకు దూరంగా వెళ్లిపోతాయి. ఐదు నుంచి పది ఎకరాలకు రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకూ పలు ధరల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే ఫెన్సింగ్ ఇచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చెట్లు, గడ్డి తీగలకు సోలార్ తీగలు తగలకుండా చూడటం వల్ల సోలార్ పనితీరు చక్కగా ఉంటుందని సంబంధిత నిపుణులు పేర్కొంటున్నారు.

సబ్సిడీ ఇవ్వాలి

సోలార్ ఫెన్సింగ్ వల్ల రైతులు తక్కువ ఖర్చుతో ఎలాంటి ప్రమాదాలు లేకుండా పంటలను కాపాడుకోవచ్చు. ఇలాంటి ప్రయోజకరమైన పరికరాలకు ప్రభుత్వం రాయితీతో అందించి ప్రోత్సహించాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. పొలాలు, పండ్ల తోటల చుట్టూ కంచె ఏర్పాటు చేసుకోవడం చాలా ఖర్చుతో కూడిన పని. ఇలాంటి సమయంలో చిన్న, సన్నకారు రైతులకు సోలార్ ఫెన్సింగ్ ప్రత్యామ్నాయంగా మారిందని సబ్సిడీ అందిస్తే చాలా మందికి లబ్ధి చేకూరుతుందని రైతులు అంటున్నారు.

పశువుల బెడద తగ్గింది



రోడ్డు పక్కనే చీనీ తోట ఉండటంతో మూగ జీవాలు, పశువుల బెడద ఎక్కువగా మారింది. ఇనుప కంచె ఏర్పాటు కంటే సోలార్ తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసుకోవచ్చని తోటి రైతులు చెప్పడంతో రూ.12 వేలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నా. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవడం వల్ల పశువులు, అడవి జంతువుల బెడద తగ్గింది.

– బి.రామలింగేశ్వరరెడ్డి, చీనీ రైతు, పుట్లూరు

నవరాత్రులకు ఆలయాల ముస్తాబు

పామిడి: దేవీ శరన్న నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని కన్యకా పరమేశ్వరిమాత, భవానీమాత, అనుంపల్లి ఒడ్డుగట్టు సుంకులమ్మ తదితర ఆలయాలను ముస్తాబు చేశారు. ఆయా ఆలయాల్లోని అమ్మవార్లకు సోమవారం నుంచి అక్టోబర్ 2 ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సందర్భంగా ఆలయాల్లోని అమ్మవార్లు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనం ఇవ్వనున్నారు. అందులో భాగంగా స్థానిక కన్యకా పరమేశ్వరి మాత 22న బాల త్రిపుర సుందరిదేవి, 23న అన్నపూర్ణదేవి, 24న గాయత్రిదేవి, 25న కాత్యాయని దేవి. 26న లలిత త్రిపుర సుందరిదేవి, 27న ధనలక్ష్మి, 28న గరుడ వాహనసేవ, 29న సరస్వతి దేవి, 30న మహిషాసుర మర్దిని, అక్టోబర్ 1న రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. 2న ఉదయం హోమం, సాయంత్రం 7 గంటలకు విజయలక్ష్మి అలంకరణలో కేరళ డ్రమ్ముల వాయిద్యాలు, చెక్క భజలతో వాసవీ మాత గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అలాగే బీసీ కాలనీలోని అంబాభవానీమాత రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


అలంకరణలో కన్యకా పరమేశ్వరిమాత

నారాయణుడికి పూజలు


ప్రత్యేక అలంకరణలో శింగరబట్లు, గణపతి, నారాయణస్వామి

పెద్దపప్పూరు: భాద్రపద మాసం ఆదివారం సందర్భంగా చిన్నపప్పూరు సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థనారాయణస్వామి, చక్ర భీమలింగేశ్వరులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు గ్రామపెద్దలు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నెల 29న నూతన ఆలయ కమిటీ ఎంపికను ఎన్నుకోనున్నట్లు ఈఓ సుబ్రమణ్యం తెలిపారు.

'కోటంక'లో పూజలు


పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'సమస్యల పరిష్కారమే లక్ష్యం'

పామిడి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని తహసీల్దార్ సీ షర్మిల అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎవరికీ ముడుపులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. మండల ప్రజలు రెవెన్యూ పరమైన సమస్యలను ఎటువంటి సిఫారసులు లేకుండా నేరుగా వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. న్యాయపరమైన సమస్యల సత్వర పరిష్కరానికి కృషి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి సిబ్బంది ఎవరైనా లంచం అడిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టడానికి వెనుకాడమన్నారు. రెవెన్యూపరమైన ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.

చర్చిల్లో ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. మానవుడి హృదయం దేవాలయం లాంటిదన్నారు. అలాంటి హృదయాన్ని పరిశుద్ధంగా ఉంచుకోవాలన్నారు. క్రీస్తుతోనే మనకు నిత్యజీవం ప్రాప్తిస్తుందన్నారు కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, జయరాజు, జకరయ్య, బుజ్జిబాబు, అబ్రహం, దేవదాసు, హోసన్న, కరుణాకర్, వరప్రసాద్, రజని, పాస్టరమ్మ సువర్ణమ్మ, మంజులమ్మ, చంద్రకళ, శాంతమ్మ, ప్రిస్కిల్లా, సుశీలమ్మ, రేచెల్, లత, వాణి, మహిమ, సార మాధురి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దల పండుగ


గుత్తిలోని అమృత్ సినిమా థియేటర్ ఏరియా జనాలతో కిక్కిరిసిన దృశ్యం


గుత్తిలో టెంకాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

గుత్తి: గుత్తిలో దసరా పెద్దల పండుగను పురస్కరించుకుని ఆదివారం ప్రజలు మార్కెట్లకు తరలివచ్చారు. దీంతో మార్కెట్లు జనాలతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా అమృత్ సినిమా థియేటర్ ఏరియా, అంబేద్కర్ కూరగాయల మార్కెట్, ఇందిరా గాంధీ కూరగాయల మార్కెట్ జనాలతో నిండిపోయాయి. గాంధీ సర్కిల్ వద్ద నుంచి అమృత్ సినిమా థియేటర్ వరకు జనాలు కిక్కిరిసిపోయారు. ప్రతి అర గంటకు ఒకసారి ట్రాఫిక్ జామ్ అవడంతో జనాలు ముఖ్యంగా వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడం పోలీసులకు తలకుమించిన భారమైంది. పెద్దలకు ఇష్టమైన పదార్థాలు, స్వీట్లు, దుస్తులు కొనుగోలు చేయడానికి ప్రజలు బారులు తీరారు. దీంతో వ్యాపారులు స్వీట్లు, టెంకాయలు, కూరగాయలు, దుస్తులు, పూల ధరలు ఇష్టానుసారం పెంచేశారు.

మటన్ దుకాణాలు కిటకిట

తాడిపత్రి రూరల్: పెద్దల అమావాస్యతో ఆదివారం పట్టణంలోని మటన్ దుకాణాలు కిటకిటలాడాయి. పట్టణంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన వారి రాకతో పలు ప్రాంతాల్లోని మటన్ దుకాణాలకు డిమాండ్ కనిపించింది. తెల్లవారుజామున నుంచి మటన్ కొనుగోలు కోసం ప్రజలు ఎగబడ్డారు. పట్టణంలోని మటన్ మార్కెట్, చిన్న బజారు, పుట్లూరు రోడ్డు, యల్లనూరు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, గన్నెవారిపల్లి కాలనీ, నంద్యాల రోడ్డు, సంతమార్కెట్, శ్రీనివాసపురం, నందలపాడుల్లోని మటన్ దుకాణాలు జనాలతో కిక్కిరిసిపోయాయి.


తాడిపత్రిలోని మటన్ దుకాణం వద్ద ప్రజలు

పెద్దపప్పూరు: పెత్తర్ల అమావాస్య (పెద్దల పండుగ) సందర్భంగా పెద్దపప్పూరులోని చిన్న అశ్వత్థయ్య ఆశ్రమంలో ఆదివారం ధర్మాపురం గ్రామానికి చెందిన మాదినేని మహేష్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు మోహన్‌దాస్, చింతాపురుషోత్తం తదితరలు పాల్గొన్నారు.అలాగే మండలకేంద్రంలోని శ్మశానవాటిలో పెద్దల సమాధులను ప్రజలు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

పామిడి: పామిడిలో ఆదివారం పెద్దల అమవాస్య రోజును పురస్కరించుకుని పలు దుకాణాలు వెలిశాయి. అమవాస్య రోజు ఇంటిలోని దుష్టశక్తులను నివారించడానికి చెట్టుపై నుంచి తీసిన కొబ్బరికాయలను గృహాల్లో ఏర్పాటు చేసే సాంప్రదాయం ఉంది. ఈ క్రమంలో చెట్టుమీది కొబ్బరికాయలకు మంచి గిరాకీ లభించింది.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

గుంతకల్లు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని డీఆర్ఎం చంద్ర శేఖర్ గుప్తా పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రైల్వే పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ రోజు రోజుకూ పెరుగుతున్న కాలుష్య నివారణకు మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్, ఎతఎస్ రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.


నాటిన మొక్కకు నీళ్లుపోస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

'నషా ముక్త్'పై అవగాహన

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని ప్రభుత్వ బాయ్స్ హాస్టల్‌లో ఆదివారం 'నషా ముక్త్ భారత్ అభియాన్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు ఏపీ చక్రపాణి, కేశవ, సభ్యులు పురుషోత్తం, ఆటోవేణు, మహేష్, లింగేశ్వర్‌బాబు, శ్రీనివాస్, స్నేహ, అంజలి, మారుతి, రత్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంజుల వెంకటేష్

'ఆలూరు'కు సన్మానం


ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శింగనమల(నార్పల): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డిని పార్టీ స్టేట్ అడ్మిన్ హెడ్‌గా నియమించడంతో నార్పల మండలానికి చెందిన నాయకులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ కార్యదర్శి రఘునాథరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప, మహిళా నాయకురాలు బండి లలిత కళ్యాణి, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు 'గురజాడ'


గురుజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీ భారతి సాహిత్య సమితి సభ్యులు

గుంతకల్లు: గురుజాడ అప్పారావు చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. ఆదివారం పట్టణంలో శ్రీ భారతీ సాహిత్య సమితి ఆధ్వర్యంలో గురుజాడ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాముడు, గంగమ్మ, నాయకులు చలపతి, గంగరాజు, రామాంజనేయులు, నాగేంద్ర, శంకరయ్య, బషీర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానం అందించాలి


మాట్లాడుతున్న వెన్నపూస బ్రహ్మానందరెడ్డి

తాడిపత్రిటౌన్: విద్యార్థులు శాస్త్ర విజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నపుడే సమస్యలు పరిష్కరించుకోగలరని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి అన్నారు. తాడిపత్రి పట్టణంలోని పద్మవాణి పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన జీవిత నైపుణ్యాన్ని తరగతి గదిలోనే బోధించాలన్నారు. తద్వారా భవిష్యత్‌లో సమస్యలు పరిష్కరించుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రామగోవింద రెడ్డి, ఉపాధ్యాయుడు నాగపీరయ్య, కార్యనిర్వహణ అధ్యక్షులు రమణయ్య, గోపాల్‌నాయక్, సేతు రామ్మేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: మండలంలోని వేములపాడు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ6,350 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇరువర్గాల వాగ్వాదం

పెద్దవడుగూరు: మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో ఆదివారం ఇరువర్గాల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని సర్వే నంబర్ 111లో శ్మశాన వాటికకు సంబంధించిన భూమిలో.. గ్రామానికి చెందిన కొంతమంది గత కొన్నేళ్లగా కలందొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే అధికారపార్టీకి చెందిన ఓ వ్యక్తి ఆదివారం వాటిని జేసీబీతో తొలగించే ప్రయత్నం చేయడంతో అనుభవదారులతో వాగ్వాదం చోటు చేసుకుంది. కొంతమంది 100కు డయల్ చేయడంతో సీఐ రామసుబ్బారెడ్డి, పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలతో చర్చించి సమస్య సద్దుమణిగేలా చేశారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

'అక్షర విన్యాసాలు' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టినట్టుండే అక్షర విన్యాసాలు, గేయాలు, పాటలు పుస్తకాలు అందరూ చదవదగినవని వైఎస్సార్ స్మారక జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ అన్నారు. బిక్కి నాగమ్మ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్ వేదికగా సంగీత కళాకారుడు, కథా రచయిత అగ్రహారం సత్యనారాయణ రచించిన 'గేయములు, పాటలు', 'అక్షర విన్యాసాలు' పుస్తకాల ఆవిష్కరణ ఘనంగా జరిగింది. రాజారామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అంకే శ్రీనివాస్, అడవాల శేషగిరిరాయుడు, గురువేపల్లి నరసింహులు, అచ్చన్న, గంగన్న, యాములపల్లె నర్సిరెడ్డి, కార్తీక్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై మురుగు పారుతున్న దృశ్యం

ముక్కు మూసుకోవాల్సిందే..

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని శ్రీ గవి వేంకటేశ్వరస్వామి కాలనీలోకి వెళ్లే మార్గం అపరిశుభ్రంగా ఉంది. చెత్తాచెదారంతో నిండి పరిసరాలు కంపు కొడుతున్నాయి. సీసీ రోడ్డుకిరువైపులా డ్రైనేజీల్లేని కారణంగా మురుగు నీరంతా రోడ్డుపైనే పారుతోంది. కాలనీలోకి నడుచుకుంటూ వెళ్లాలంటే తప్పనిసరిగా ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అపరిశుభ్రత కారణంగా దోమలు విపరీతంగా పెరిగి అనారోగ్య సమస్యలు ఏర్పడే అవకాశాలున్నాయి. పరిసరాలను శుభ్రం చేయించి, రోజూ ఇంటింటి చెత్తసేకరణ క్రమంగా జరిగేలా చూడాలని, డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎనీటైం మూత!



గుత్తి ఆర్ఎస్ రైల్వే బుకింగ్ ఆఫీస్ వద్ద మూతపడిన ఏటీఎం కేంద్రం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో ఎపుడూ రద్దీగా ఉండే రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం మూతపడింది. ఆరు నెలల క్రితం ఎస్‌బీఐ అధికారులు ఏటీఎం కేంద్రాన్ని మూసివేశారు. అక్కడ పని చేసే సెక్యూరిటీ గార్డును కూడా మరో ప్రాంతానికి బదిలీ చేశారు. ఏటీఎం కేంద్రం మూత పడటంతో రైల్వే ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు ప్రయాణికులు ఏటీఎం కేంద్రంలో డబ్బులు డ్రా చేసుకుని టికెట్లు కొనుగోలు చేసేవారు. అయితే ఏటీఎం కేంద్రం మూత పడటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎస్‌బీఐ అధికారులు స్పందించి ఏటీఎం కేంద్రాన్ని ఓపెన్ చేయించాలని ప్రయాణికులతో పాటు స్థానికులు కోరుతున్నారు.